# సాక్షి
## మానవ హక్కుల నిఘా

NEWSLETTER - 24 ✳ BI MONTHLY ✳ FOR PRIVATE CIRCULATION ONLY ✳ APRIL - MAY 2009


**ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతం కావాలంటే సమాజంలో అస్వతంత్రత - అసమానతలు తొలగిపోవాలి.**

- డా॥ బి.ఆర్. అంబేద్కర్



గిరిజన ఓటర్లు అడవిలో కాలినడకన వెళ్తున్న దృశ్యం



పిల్లాపాపలతో బిక్కు బిక్కుమంటూ వున్న ఓ గిరిజన మహిళ



పోలింగ్‌ను బహిష్కరించి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు



గాయపడిన వంకాయలపాటి వెంకటేశ్వర్లు

# ఎన్నికలలో దళితుల, గిరిజనుల, యువత పాత్ర

...✍ - వి. నందగోపాల్

ఆరు దశాబ్దాల ప్రజాస్వామ్య ఆంధ్రప్రదేశ్‌లో దళిత, గిరిజన సంక్షేమాభివృద్ధిలో ఎలాంటి మార్పులూ లేవు. స్వాతంత్ర్యానంతరం దారిద్ర్యరేఖకు దిగువన 45% ప్రజలుండగా, నేడు 15% తగ్గినట్లు రాష్ట్ర ఎకనమిక్ సర్వే తెలియచేస్తున్నది. కానీ, దళిత జనాభాలో మాత్రమే గణాంకాలు-పరిశీలించినప్పుడు స్వాతంత్ర్యనంతరం దళితులలో 16 శాతానికి మించి అభివృద్ధి జరుగలేదు. విద్యాభివృద్ధికి, ఉపాధి కల్పనకు అనేక పథకాలుపెట్టినా, రిజర్వేషన్లు అమలు జరిపినా, పరిస్థితిలో మార్పులేదు. క్రీమిలేయర్ విధానాన్ని అనుసరించాలంటూ, ఒక కుటుంబంలో ఒకరికి ఒకసారి మాత్రమే ఉపాధి కల్పించాలన్న సిద్ధాంతం పాటించాలంటున్నారు. ఒక విధంగా ఈ సూత్రం అమలు జరపడమంటే దళితుల అభివృద్ధిని నిరాకరించడమే. ఎన్నికల అనంతరం దళితుల అభివృద్ధికి జరుగుతున్న కృషిని సమీక్షించడానికి శాసన సభలలో గానీ, పార్లమెంట్‌లోగానీ నేటివరకు ఏనాడు సమీక్షలు జరుపలేదు. జరపాలన్న లక్ష్యం కూడా ప్రభుత్వాలకు లేదు. అభివృద్ధి సాకుతో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టినప్పటికీ, వాటి అమలులో తగిన శ్రద్ధ కనపరచడం లేదు. ఎన్నికలలో ఎలక్షన్ ఓట్లకోసం దళిత భజన చేసిన రాజకీయపార్టీలు వారిని ఆకర్షించడానికి వారి అభివృద్ధికి హామీనిస్తూ అనేక ప్రమాణాలు గుప్పించాయి. పార్టీ జెండాలు మోయడానికి, ప్రచారం చేయడానికి దళితులను తమ స్వార్ధపూరిత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాయి. గత అనుభవాల దృష్ట్యా ఎన్నికల్లో బ్యానర్లు జెండాలు మోయించడం, డబ్బు, చీరలు మొ॥ వాటిని పంపిణీ చేసి, ఓటర్లను కొనుగోలు చేయడం, వారిని ప్రలోభపెట్టడం భారీస్థాయిలో జరిగాయి. ప్రత్యర్ధి అభ్యర్ధులకు సంబంధించి దాడులు చేయడం ఇటువంటి చర్యల్లో రాజకీయ నాయకులు, యువకులను ఉపయోగించుకున్నారు. మరోవైపు వీటి బాధ్యతలు బుజానావేసుకున్న యువత ఈ తనిఖీల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుపడడంతో చివరకు వీరి భవిష్యత్ అంధకారంగా తయారయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే ఈ పనులు అప్పగించి తెరవెనుక ఉన్న నాయకులు మాత్రం బయటపడకుండా తప్పించుకోవడం విశేషం. ఎన్నికల కేసుల్లో పట్టుబడిన వారిలో ఎక్కువమంది యువకులే ఉన్నట్లు అధికారిక సమాచారం. ఈ కేసులు నమోదైన యువకులను అవి జీవితాంతం వెంటాడే పరిస్థితి ఉంది. కేసుల్లో ఉన్న వ్యక్తులకు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత లేకపోవడంతో రాజకీయ నాయకుల స్వార్ధప్రయోజనాలు యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నాయి. రాజకీయ పడగనీడలో యువత కొట్టుమిట్టాడుతున్నారు. ఈ విధంగా దళిత, గిరిజనులు, యువత రాజకీయ నాయకుల స్వార్ధప్రయోజనాలకు బలవుతున్నారు. వీరు ఈ పరిస్థితులు, ప్రలోభాల నుండి బయటపడి, తమ జీవితాలను చక్కదిద్దుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వారిని ఆ దిశగా నడిపించడానికి అవసరమైన చర్యలు తీసుకోవలసిన బాధ్యత ప్రభుత్వానిదే.

## దళిత్ కాల్ లైన్

**మీ గ్రామంలో దళితులపై జరిగే ఏవిధమైన దాడులనైనా వెంటనే సాక్షి మానవ హక్కుల నిఘాకు తెలియజేయాలంటే ఉచిత ఫోన్ కాల్ లైన్ నెంబరు : 18004255535 నంబరుకు చేయవలసినదిగా కోరుతున్నాము. ఈ నెంబరుకు BSNL Land లైన్ ద్వారా మాత్రమే చేయవచ్చు. ఏ ఇతర ఫోనుల నుండైనా చేయదలచుకొంటే 040-27737093 కి చెయవలెను. మీ సమస్యలపై అవసరమైన సలహాలు అందజేయడం మా బాధ్యతగా భావిస్తాము.**

ఇట్లు

సాక్షి మానవ హక్కుల నిఘా

# ఎన్నికల ప్రణాళికలు అమలు జరుగుతున్నాయా ?

...✍ - సారంపల్లి

2009లో జరిగిన 15వ లోక్‌సభ ఎన్నికలు, 13వ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ముగిశాయి. ఫలితాలు వచ్చాయి. ఎన్నికలకు ముందు పాలకవర్గ పార్టీలు ప్రణాళికలు ప్రకటించాయి. ఆ ప్రణాళికలలో దళితులు, గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యత యిచ్చారు. ఎన్నికల అనంతరం దళితుల – గిరిజనుల అభివృద్ధికి యిచ్చిన హామీలు జరపడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఎన్నిసార్లు ఎన్నికలు జరిగినా దళితులు – గిరిజనుల ఓట్లను రాబట్టడానికి ఎత్తులపై ఎత్తులు వేసి ప్రలోభపెట్టి వారి ఓట్లతో అధికారానికి వస్తున్నారు. కొద్దిమందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మంత్రి పదవులు కూడా యిచ్చారు. అటు ప్రభుత్వాలు కాని, యిటు మంత్రిపదవులు పొందినవారు కానీ వీరి సంక్షేమం గురించి అంతగా పట్టించుకోలేదు. చివరకు వారికి కేటాయించిన బడ్జెట్ కూడా విడుదల చేయకుండా మురగపెట్టడమో లేక యితర పద్దులకు మళ్ళించడమో జరిగింది. నేటికీ అంటరానితనం, అవిద్య, అనారోగ్యం, గూడులేనితనం వీరిని వెన్నాడుతూనే వున్నాయి. దారిద్ర్యానికి మారుపేరుగా యీ వర్గాలు మురికివాడల్లో నివాసాలు వెళ్ళదీస్తున్నాయి.

ఆరు దశాబ్దాలు గడచినా దళిత గిరిజన సంక్షేమాభివృద్ధిలో ఎలాంటి మార్పులూలేవు. స్వాతంత్ర్యానంతరం దారిద్ర్య రేఖకు దిగువన 45శాతం ప్రజలుండగా, నేడు 15శాతానికి తగ్గినట్లు రాష్ట్ర ఎకనమిక్ సర్వే తెలియజేస్తున్నది. కానీ, దళిత జనాభాలో మాత్రమే గణాంకాలు పరిశీలించినప్పుడు స్వాతంత్ర్యానంతరం దళితులలో ఐదారు శాతానికి మించి అభివృద్ధి జరగలేదు. విద్యాభివృద్ధికి, ఉపాధి కల్పనకు అనేక పథకాలు పెట్టినా, రిజర్వేషన్లు అమలు జరిపినా "ఎక్కడవేసిన గొంగళి అక్కడే " అన్న చందంగా వుంది. క్రిమిలేయర్ విధానాన్ని అనుసరించాలంటూ ఒక కుటుంబంలో ఒకరికి ఒకసారి మాత్రమే ఉపాధి కల్పించాలన్న సిద్ధాంతం పాటించాలంటున్నారు. ఒక విధంగా ఈ సూత్రం అమలుజరపడమంటే దళితుల అభివృద్ధిని నిరాకరించడమే. ఎన్నికల అనంతరం దళితుల అభివృద్ధికి జరుగుతున్న కృషిని సమీక్షించడానికి శాసనసభలలోగానీ, పార్లమెంట్‌లో గానీ నేటి వరకు ఏనాడూ సమీక్షలు జరపలేదు. జరపాలన్న లక్ష్యం కూడా ప్రభుత్వాలకు లేదు. ఎన్నికలకు ముందున్న ఉత్సాహం ఎన్నికల అనంతరం పాలకులు ప్రదర్శించడంలేదు.

2008–09 సంవత్సరానికి దళితుల సంక్షేమానికి ఆ శాఖనుండి రు. 2800 కోట్ల బడ్జెట్‌కు డిమాండ్ చేయగా, రు. 2200 కోట్లు మాత్రమే కేటాయించారు. కానీ, రు. 1700 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఈ నిధులతో దళిత సంక్షేమం జరుగుతుందా? యేటా జరుగుతున్నదిదే !. బడ్జెట్‌లోను, యితర అన్ని కేటాయింపులలోను స్పెషల్ ఎకనమిక్ కాంపోనెంట్ పేరుతో 15శాతం నిధులను కేటాయించాలని కేంద్ర ప్రణాళికా బోర్డు ఆమోదం తెలిపింది. ఈ కాంపోనెంట్ క్రింద కేటాయించిన నిధులు వాస్తవంగా నేటివరకు యీ వర్గాలకు యేం చేస్తే ప్రస్తుతమున్న స్థితికన్నా వీరి అభివృద్ధిలో కొంతమార్పు వచ్చేది. కానీ యీ నిధులను కూడా దారి మళ్ళిస్తున్నారు. ఒక ఆంధ్రప్రదేశ్‌లోనే రు. 20వేల కోట్లు నేటివరకు దారిమళ్ళాయంటే దేశంలో ఎన్నివేల కోట్లు దారి మళ్ళాయో అర్థం చేసుకోవచ్చు. చట్టబద్ధంగా కేటాయించిన యీ నిధులను దారిమళ్ళిస్తుంటే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు యేం చేస్తున్నట్లు? కనీసం దళిత, గిరిజన ప్రజా ప్రతినిధులు కూడా యీ అంశంపై ప్రభుత్వాలను నిలదీయలేకపోతున్నారు. వీరి సంక్షేమానికి వేల కోట్లు కేటాయిస్తున్నామన్న ప్రభుత్వ వాదనలు యీ విధంగా వున్నాయి.

రాజ్యాంగంలో హక్కులు కల్పించినా అవి అమలుకు నోచుకోలేదు. వీరి కొనుగోలు శక్తి పెరగడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రకటించాయి. అయినా "ఎక్కడవేసిన గొంగళి అక్కడే" అన్నట్లుగా వుంది. కొన్ని ఆకర్షణీయ పథకాలను ప్రకటించి తాత్కాలిక ప్రయోజనం మాత్రమే కల్పిస్తున్నారు. దీర్ఘకాలికంగా వీరి అభివృద్ధికి నేటి వరకు ఏఒక్క పథకం అమలు చేయలేదు. ప్రధానంగా భూ పంపిణీ సమస్య అలాగే వుంది. 1973లో భూ సంస్కరణల చట్టం వచ్చినా నేటికీ యీ వర్గాలు నాల్గు రాష్ట్రాలు మినహా ఎక్కడా యీ వర్గాలకు భూ పంపిణీ జరగలేదు. చట్టవిరుద్ధంగా నేటికీ లక్షలాది ఎకరాలు కల్గిన భూస్వాములు కొనసాగుతున్నారు. చట్టవిరుద్ధంగా ప్రభుత్వాలు వీరికి అండగా వుంటున్నాయి. పట్టణ భూ పరిమితి చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో రద్దుచేశారు. గ్రామీణ భూ పరిమితి చట్టాన్ని కూడా రద్దుచేసే ఆలోచన కొనసాగుతుంది. ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు భూ సేకరణకు చట్టాన్ని మార్చాల్సిన అవసరంవుందని వాదిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుండి భూ పంపిణీ జరగడానికి బదులు పేద, దళిత, గిరిజనుల నుండి ప్రభుత్వమే బలవంతంగా భూ సేకరణ చేస్తుండగా కొద్దీగొప్పా ఆస్తులున్న వారు వీధిపాలవుతున్నారు. వీరివద్ద నుండి సేకరించిన భూమిని రియల్ ఎస్టేట్‌ల పరంచేసి ధనిక వర్గాలు వేలకోట్ల ఆదాయాన్ని సంపాదిస్తున్నారు.

( ☛ తరువాయి 6వ పేజిలో....)

# అభివృద్ధి బాట

...✍ - కె. ప్రసన్న

దేశ వ్యాప్తంగా ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో 13వ సార్వత్రిక ఎన్నికలు జరగడం, ప్రజలు తమ తీర్పును చెప్పడం, రాష్ట్రంలోనూ, కేంద్రంలోను కాంగ్రెస్ పార్టీ మరలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంతా జరిగిపోయింది. ఎలక్షన్‌లో ఓట్లకోసం దళిత భజన చేసిన రాజకీయ పార్టీలు, అధికార పార్టీ దళితులను ఆకర్షించడానికి, వారి అభివృద్ధికి హామీనిస్తూ అనేక ప్రమాణాలు గుప్పించాయి. తమ పార్టీల జండాలు మోయడానికి, ప్రచారం చేయడానికి, దళితులను తమ స్వార్ధపూరిత రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఎన్నికల ముందుగానీ తరువాత గానీ వారి గురించి తలపోసే వారే ఉండరు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి మూడు సంవత్సరాలు తమ స్వలాభాలకే ప్రాధాన్యమిచ్చే ప్రభుత్వాలు, తరువాత ఎలక్షన్‌లో మరలా గెలవడానికి చివరి రెండు సంవత్సరాలు అభివృద్ధి పేరుతో వెంపర్లాడడం జగమెరిగిన సత్యం. ఎలక్షన్‌లలో దళితుల పాత్ర, దళితులపై దళితేతరుల ప్రభావం గురించి మనం గ్రహించాలంటే ఒకసారి గత ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా ఏమి జరిగిందో గమనించాలి.

**ఎన్నికల సమయంలో**

- దళితుల ఓట్లను లిస్టునుండి తొలగించడం.
- కులంపేరుతో దూషించి, దాడిచేసి, అవమానించడం.
- రాజకీయ పార్టీల మధ్య జరిగిన గొడవలలో దళితులను పావులుగా ఉపయోగించుకోవడం.
- దళితుల ఓట్లను రిగ్గింగ్ చేయడం.
- దళిత ఓటర్లను, ఓటు వినియోగించుకోనివ్వకుండా పోలింగ్ బూత్‌లను మూసివేయడం.
- అగ్రవర్ణాల వారికంటే ముందు ఓటు వేయడానికి వచ్చినందున, వారు వేసిన తరువాత ఓటు వేయమని వెనక్కిపంపడం.
- డబ్బు, చీప్‌లిక్కర్ ఆశచూపి, తమ పార్టీకి ఓటు వేయమని ప్రలోభపెట్టడం.
- దళిత పోలింగ్ ఏజెంట్‌పై పోలీసు అధికారుల దాడి.
- స్వయనా అధికారులే దళితులను ఓటుహక్కు వినియోగించుకోనివ్వకపోవడం.
- దళితులపై పోలీసుల దాడి.
- దళిత రాజకీయ నాయకుల పేర్లు ఓటర్ల లిస్టునుండి తొలగించడం.
- క్రొత్త ఓటర్ల లిస్టు కనిపించక, పాత ఓటర్ల లిస్టులో ఉన్న వారిని మాత్రమే ఓటు వినియోగించు కోనివ్వడం వలన క్రొత్త ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోవడం.
- పోలింగ్ బూత్‌లు దళిత వాడలకు దూరంగా, వారికి అనుకూలంగా లేనందున దళితులు ఓటుహక్కు వినియోగించుకోలేకపోవడం.
- రాజకీయ నాయకులు తమకు ఓటు వేయలేదని లేదా తమ వ్యతిరేక పార్టీకి ఓటు వేశారని దళితులపై దాడులు చేయడం.
- పాతకక్షలను సాధించడానికి ఎన్నికలను వేదికగా చేసుకొని దళితులపై సామూహిక దాడులు చేయడం.
- దాడులకు భయపడి దళితులు, గిరిజనులు ఎలక్షన్లు బహిష్కరించడం.

ఇలాంటి అనేకమైన కారణాలతోటి మొత్తం 217 కేసులు సాక్షి మానవహక్కుల నిఘా దృష్టికి వచ్చాయి. ఇవికొన్ని మాత్రమే రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో ఎన్నికల అత్యాచారాల కేసులు జరిగనప్పటికీ, అవన్నీ వెలుగు చూసి ఉండకపోవచ్చు అనే సందేహం వ్యక్తమవుతుంది. మరి జరిగిన అత్యాచార నేరాలపై ఎలక్షన్ కమీషన్ ఎటువంటి చర్యలు తీసుకుంది ? నిందితులను శిక్షించిందా ? ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం, పునరావాసం, రక్షణ కల్పించి న్యాయం చేసిందా ? అనేవి మన ముందున్న ప్రశ్నలు.

**మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం యొక్క మ్యానిఫెస్టోని గుర్తు చేసుకుంటే**

- నిరంతర విద్యుత్తు
- రెండు రూపాయల బియ్యం పథకంలో 4-6 కేజీల అదనపు బియ్యం.
- రాబోవు 4 సంవత్సరాలలో ప్రతి ఇంటికి ఉచిత ఎల్‌పి గ్యాస్ కనెక్షన్
- నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంలో ఉన్న ప్రాంతాలలో 24.5 ఎకరాల ఆయకట్టు నిర్మాణం.
- అభివృద్ధి ప్రాముఖ్యత.
- సంక్షేమ పథకాలు.
- నర్సరీ నుండి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్య.
- రైతులకు ఉచిత విద్యుత్తు.

- గృహాలు లేనివారికి పక్కా ఇళ్ళు నిర్మించడం
- ప్రతి ఇంటికి కనీస వసతులు కల్పించడం

మొదలైనవి ముఖ్యమైన అంశాలుగా చెప్పవచ్చు.

ప్రస్తుత ప్రభుత్వమే గత అయిదేళ్ళు అధికారంలో ఉన్నప్పటికినీ, అది ప్రవేశపెట్టిన **జాతీయ ఉపాధి హామీ పథకం** అమలు తీరు గమనించినట్లయితే,

- ప్రకాశం జిల్లా కనిగిరి మండలంలో పని చేసిన కూలీలకు వేతనాలు సరిగా చెల్లించలేదు.
- మహబూబ్‌నగర్, మోత్కూరులో కూలీలకు వేతనాలు అందకపోవడంతో కూలీలు తిరగబడ్డారు. పనిచేసే చోట సరైన వసతులు, వైద్య సదుపాయాలు కల్పించడం లేదు. పనులు చేస్తున్న సమయంలో గాయాలై చికిత్స చేసుకున్న కూలీలకు చెల్లించాల్సిన మెడికల్ బిల్లు చెల్లించకుండా వారిని ఇబ్బంది పెడుతున్నారు.
- అదిలాబాద్, కాగజ్‌నగర్, కౌటాల మండంలోని కొన్ని ప్రాంతాలలో కూలీలకు వేతనాలు అందించడం లేదు.
- కడప, చింతకొమ్మదిన్నె మండలంలోని ఇప్పపెంట గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న సాయినగర్ గ్రామప్రజలు ఉపాధి లేక ఊరు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

**ప్రజాపంపిణీ వ్యవస్థను గమనిస్తే,**

- గ్రేటర్ హైదరాబాద్‌లో పౌరసంఘాల శాఖ అధికారుల నిర్లక్ష్యం వలన పేదలకు చెందవలసిన రెండు రూపాయల కిలో బియ్యం పథకం పక్కదారి పడుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు కడుపునిండా తిండిపెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల సబ్సిడీ భరిస్తూ, కొనసాగిస్తున్న ఈ పథకం వ్యాపారులకు దళారులకు వరంగా మారింది. పెంచిన ఆదాయ పరిమితి ప్రకారం నగరంలో 75 వేల వరకు వార్షికాదాయం ఉన్నవారు తెల్లరేషన్‌కార్డు తీసుకోవడానికి అర్హులు.
- సికింద్రాబాద్, చిలకలగూడలో సర్కిల్ 9 పరిధిలో వేల సంఖ్యలో కార్డులు పంపిణీ చేసినప్పటికీ సరుకులు అందించలేదు.
- రంగారెడ్డి, సార్వత్రిక ఎన్నికల హడావుడిలో బిజీగా ఉన్న అధికారులకు పేదల ఆకలి కేకలు పట్టలేదు. ఎన్నికల హడావుడిలో పేదలకు సరఫరా చేయాల్సిన నిత్యవసర వస్తువుల సంగతి పట్టించుకోకవడంతో రేషన్ దుకాణాల ద్వారా వినియోగదారులకు సరుకులు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**మధ్యాహ్నభోజన పథకం గమనించినట్లయితే**

- నిజామాబాద్ జిల్లాలో కమ్మరపల్లి మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలల్లో మంగళవారం మధ్యాహ్నభోజనం వండకపోవడం వల్ల విద్యార్థులు పస్తులున్నారు.
- శ్రీకాకుళం జిల్లాలో సంతకవిటి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వంట ఏజెన్సీ ఇచ్చే విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరగడంతో వంట చేయకుండా విద్యార్థులను పస్తులుంచారు.
- వరంగల్ జిల్లా, సంగెం మండలంలో దళితులు వంట చేస్తున్నారని స్వయానా ఆ గ్రామ సర్పంచే దళితులు వంట చేస్తే తినవద్దని సర్పంచ్ హుకుం జారీ చేశారు.
- తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే భోజనంలో కూరలో పురుగులు రావడంతో అనేక మంది విద్యార్థులు వాంతులు చేసుకున్నారు.
- **రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో** గమనిస్తే, తెల్లకార్డులు చూపించినా, వారికి ఆరోగ్యసౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమయింది. ఈ విధంగా ప్రభుత్వం పై పథకాలలోని అవినీతి, అక్రమాలను, లోపాలను అరికట్ట లేకపోయింది.

ఇక బడ్జెట్ కేటాయింపుల విషయంలో వస్తే, గత అయిదేళ్ళుగా ఎస్సీ సంక్షేమానికి కేటాయిస్తున్న బడ్జెట్‌కు, విడుదల చేసిన నిధులకు పొంతన లేకుండా పోయింది. చాలీచాలని బడ్జెట్‌ను కేటాయిస్తూనే మరోప్రక్క వాటిలో కోతపెట్టడం వలన లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగడంలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో అయినా, సాంఘిక సంక్షేమానికి నిధులు కేటాయించడమే కాకుండా వాటిని పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ప్రభుత్వం, ప్రధానంగా ఆర్థిక శాఖ చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

**గత అయిదేళ్ళుగా ఎస్సీ సంక్షేమానికి కేటాయింపులు, విడుదల చేసిన నిధుల వివరాలు (కోట్లరూపాయల్లో)**

| ఆర్థిక సంవత్సరం | బడ్జెట్ కేటాయింపు | విడుదల చేసిన నిధులు | కోతపడిన మొత్తం |
|---|---|---|---|
| 2004-05 | 668.52 | 625.71 | 42.81 |
| 2005-06 | 700.04 | 574.67 | 125.37 |
| 2006-07 | 1,233.78 | 700.67 | 533.11 |
| 2007-08 | 1,397.99 | 1,121.64 | 2,76.35 |
| 2008-09 | 2,251.03 | 1,719.00 | 5,32.03 |
| **మొత్తం** | **6,251.36** | **4,741.69** | **1,509.67** |

(04-06-09 వార్తపేపర్ సౌజన్యంతో)

( ☛ *తరువాయి 8వ పేజిలో....*)

( ☛3వ పేజి తరువాయి భాగం...)

ఆంధ్రప్రదేశ్‌లో 13.67 లక్షల దళిత కమతాలకు 28 లక్షల ఎకరాల భూమి మాత్రమే వుంది. 2004 నుండి 2009వరకు రాష్ట్ర ప్రభుత్వం 5.77లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయగా, అందులో దళితులకు యిచ్చినది కొద్దిమాత్రమే. 2006-07 సంవత్సరాన్ని పరిశీలిస్తే 1.30లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేయగా అందులో 30వేల ఎకరాలు మాత్రమే దళితులకు పంపిణీ చేశారు. దళితులకు, గిరిజనులకు పంపిణీ చేసిన ప్రభుత్వ భూమి యేడాది తిరగకముందే దాదాపు 50శాతం భూమి తిరిగి భూస్వాముల ఆధీనంలోకి వస్తున్నది. అసైన్డ్ భూములను కొనగూడదన్న నిబంధనలను అతిక్రమించి దళితుల భూములను నయానో, భయానో కొనుగోలు చేస్తున్నారు. లేదా ప్రజా ప్రయోజనాల పేరుతో స్వాధీనం చేసుకుంటున్నారు. ఒకవైపున భూ పంపిణీ జరుగుతున్నట్లు రికార్డులలో చూపుతూనే మరోవైపున అదే భూమిని తిరిగి ధనికులు తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నారు.

గిరిజనులకు 8.63లక్షల కుటుంబాలకు 29.30 లక్షల ఎకరాల సాగుభూమి మాత్రమే వుంది. మొత్తం రాష్ట్రంలో 115 లక్షల కమతాలకు 355లక్షల ఎకరాల భూమి సాగులోవుంది. ఈ సాగు భూమిలో దళితులు, గిరిజనుల భాగస్వామ్యం ఎంతవుంది?

దళితులు - గిరిజన వర్గాలలో విద్యాభివృద్ధిచేసి వారికి ఐ ఎ ఎస్ లాంటి సివిల్ పరీక్షలలో ఉత్తీర్ణులు కావడానికి ప్రభుత్వమే ట్రైనింగ్ క్లాసులు పెట్టి ఉద్యోగ వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వ ట్రైనింగ్‌కు ఎందరు ఎంపికయ్యారో కానీ స్వంతంగా చదువుకొని అర్హతకల్గినవారు నేటికీ దేశంలో లక్షల సంఖ్యలో నిరుద్యోగులు ఉన్నారు. వీరి కొరకు కేటాయించిన ఉద్యోగాలు ఖాళీగా వున్నాయి. బ్యాక్‌లాగ్ పోస్టుల నియామకం పేరుతో యేటా ప్రకటనలు చేస్తున్నారేగానీ అర్హులున్నప్పటికీ వీరి స్థానాలను భర్తీచేయడంలేదు. నిరుద్యోగం వీరితోపాటే కొనసాగుతున్నది.

2009 ఎన్నికలకు ముందు డీ-లిమిటేషన్ చట్టంలో మార్పులు తెచ్చారు. ఈ మార్పుల ఫలితంగా రాష్ట్రంలో ఎస్సీ స్థానాలను 36 నుండి 48కి మరియు ఎస్టీ స్థానాలను 15 నుండి 19కి పెంచారు. పార్లమెంట్ స్థానాలలో ఎస్సీ స్థానాలను 6 నుండి 7కు మరియు ఎస్టీ స్థానాలను 2 నుండి 3కి పెంచారు. స్థానాల పెంపకంతో పోటీచేసేవారిని సంతృప్తిపర్చవచ్చునేమోగానీ సంఖ్య పెరగడంతో యీ వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయన్న ఆశ కనబడటంలేదు.

పార్లమెంట్‌లో కూడా యీ స్థానాలను పెంపుదలచేశారు. గతంలో 79 ఎస్సీ స్థానాలు వుండగా అవి 84కి పెరిగాయి. అలాగే ఎస్టీ స్థానాలు 41 నుండి 47కి పెరిగాయి. ఈ పెరిగిన స్థానాలలో సింహభాగం స్థానాలను బిజెపీ, కాంగ్రెస్‌లు గెల్చుకున్నాయి. 1998లో జరిగిన 12వ లోక్‌సభ ఎన్నికలలో బిజెపీ 24 ఎస్సీ, 14 ఎస్టీ స్థానాలను సంపాదించగా, కాంగ్రెస్ 14 మరియు 18లు మాత్రమే గెల్చింది. 1999లో జరిగిన 13వ లోక్‌సభలో బిజెపీ 25 ఎస్సీ, 21 ఎస్టీ స్థానాలను గెలిపొందగా, కాంగ్రెస్ 7 మరియు 9 స్థానాలను మాత్రమే గెలిపొందింది. 2004 లోక్ సభ ఎన్నికలలో బిజెపీ 18 ఎస్సీ, 15 ఎస్టీ స్థానాలను గెలుపొందగా, కాంగ్రెస్ 14 మరియు 14 స్థానాలే గెలిపొందింది. సింహభాగం యీ స్థానాలను బిజెపీ గెలిపొందింది. అయినప్పటికీ దళిత, గిరిజనుల సమస్యలు పరిష్కారం కాలేదు.

అందరికీ ''గూడు'' ఐదేండ్లలో పూర్తిచేస్తామంటూ ఎప్పటికప్పుడు ఎన్నికల ముందు ప్రకటిస్తున్నారు. దశాబ్దాలు గడిచినా యిండ్లు లేనివారి సంఖ్య పెరుగుతూనే వుంది. మురికివాడలే వీరికి నివాస ప్రాంతాలుగా వున్నాయి. ఈ మధ్య ప్రభుత్వ విధానాల ఫలితంగా జరుగుతున్న పట్టణీకరణలో ఎక్కువమంది యీ వర్గాల వారు గ్రామీణ ప్రాంతాలనుండి పట్టణ ప్రాంతాలకు తరలివస్తున్నారు. పట్టణాలలో వీరి స్థితి అత్యంత అధ్వాన్నంగా వుంది. త్రాగునీటికి, ఆరోగ్యానికి, విద్యకు దూరమై జీవిస్తున్నారు. పట్టణాలలో ఖాళీగా వున్నచోట తాత్కాలికంగా గుడిసెలు వేసుకోవడం ప్రభుత్వంలేదా ఆ భూ యజమాని తొలగించగానే మరో చోటకు వెళ్ళి గుడిసెలు వేసుకోవడంతోనే వీరి బ్రతుకు సంచార జీవుల బ్రతుకుగా మారింది. నేటికీ గ్రామీణ ప్రాంతాలలో 90శాతం మంది జీవిస్తున్నారు. వీరి పరిస్థితి అత్యంత దీనంగానే వుంది. ఇండ్ల నిర్మాణ పథకాలన్నీ పాలకుల బంధు మిత్రులకు యిస్తున్నారు. అర్హతగల దళిత, గిరిజనులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు. రేషన్‌కార్డులు- అంత్యోదయ పథకం, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ అర్హులకు రాలేదు. మన కూలీలకు ఏవీ వర్తించవు.

నేటికీ భిక్షాటన సాగుతూనేవుంది. ఆంధ్రప్రదేశ్ భిక్షాటన నివారణా చట్టంలోని 11 (1) క్రింద బాల భిక్షుకుల కోసం వర్క్ సెంటర్లను ప్రారంభించారు. ఒక్కో సెంటర్‌లో 50మంది చొప్పున రాష్ట్రంలో 15 బాల భిక్షుకుల సదనాలు వున్నాయి. అనగా 750 మందికి మాత్రమే యీ సదనాలు సక్రమంగా పనిచేస్తే ఉపయోగపడతాయి. మరి యింకా రోడ్లపై తిరుగుతున్న బీద పిల్లల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలేమి? ప్రభుత్వం అనాథ సదనాలను, విముక్తి హాస్టళ్ళను విలీనం చేసి వాటికి ఆనంద నిలయాలు అనే పేరుపెట్టారు. ఈ ఆనంద నిలయాలు రాష్ట్రంలో 79 వున్నాయి.

ఒక్కో సదనంలో 50 మందికి మాత్రమే ప్రవేశం వుంటుంది. ఈ సదనాల వల్ల మూల సమస్య భిక్షాటన, వెట్టి చాకిరీలు విముక్తి అవుతున్నాయా? వెట్టి చాకిరీ కార్మికులకు పునరావాసం కల్పించడానికి 25-10-1976న చట్టం తెచ్చారు. ఆ చట్టం క్రింద తక్షణ సహాయంగా విముక్తిచేసిన వ్యక్తికి రు. 1000లు యిస్తారు. తర్వాత అతనికి పునరావాసం కల్పించాలి. దీనికి జిల్లా స్థాయిలో జిల్లాకలెక్టర్ ఛైర్మన్‌గా, జాయింట్ కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ (డిఆర్‌డిఏ), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఎస్సీ సొసైటీ) మరియు డిప్యూటీ డైరెక్టర్ సాంఘిక సంక్షేమం కన్వీనర్‌గా వెట్టిచాకిరీ నుండి విముక్తిపొందినవారికి సహాయ పునరావాసం కల్పించాలని కమిటీ వేశారు. ఈ కమిటీ 09-06-1997న ఏర్పడింది. అట్టహాసంగా వేసిన యీ కమిటీ ప్రచారానికే తప్ప అమలు జరుగుటలేదు. ప్రధానంగా వెట్టిచాకిరీలో మగ్గుతున్నవారికి పునరావాసం క్రింద రు. 10 వేల నుండి 20వేలకు ప్రభుత్వం 08-08-2000న పెంచింది. ఈ పెంచిన నిధులు కూడా విముక్తి పొందినవారికి అందడంలేదు. వెట్టిచాకిరీని నిర్మూలించాలన్న చిత్తశుద్ధి పాలకులకు లేదు. జిల్లాల్లో వేలాదిమంది నేటికీ కడు హీన స్థితిలో వెట్టిచాకిరీ కబంధహస్తాలలో కొనసాగుతూనేవున్నారు. ఎన్నికలకు ముందు ఏం చెప్పారు? అనంతరం ఏం జరుగుతున్నది? దళితులను దారిద్ర్యవిముక్తుల్ని చేయడానికి ఆరు దశాబ్దాల కాలం అవసరమా? ప్రజా ప్రతినిధులకు రిజర్వేషన్ కల్పించారా ఆ రిజర్వేషన్ స్థానాల్లో ఎన్నికైనవారు యీ సమస్యలను సభలలో చర్చకు తెస్తున్నారా? శాసన, లోక్‌సభలలో జరుగుతున్న చర్చలను పరిశీలిస్తే దళిత, గిరిజన అభ్యుదయానికి చర్చిస్తున్న సమయమెంత? చర్చించే సమయంలో న్యాయంగా రిజర్వేషన్ ప్రకారమైనా 19శాతం సమయాన్ని కేటాయించాలి. ఏ సభను పరిశీలించినా ఆ విధంగా కేటాయింపులు జరగడంలేదు. పైగా, రిజర్వేషన్‌లలో గెలిచినవారు కూడా వీటిపై కేంద్రీకరించడంలేదు.

సమాజానికి మచ్చగా వున్న జోగిని/ బసవి వ్యవస్థ నేటికీ కొనసాగుతుండటం అత్యంత దుర్మార్గం. ఈ వ్యవస్థ రద్దుకు ఆంధ్రప్రదేశ్ దేవదాసిల (నిషేధం, అంకితం) చట్టం 1988లో చేశారు. ఆ చట్టం క్రింద పునరావాసంగా రు. 20వేలులో రు. 10వేలు సబ్సిడీగా యివ్వాలని నిర్ణయించారు. ఈ వ్యవస్థ రద్దుకు చట్టం కావాలా? వారిని విడిగానే ఆ వ్యవస్థలోనే కొనసాగేటట్టుచేసి వారికి ఆర్థిక సహాయం చేయాలా? ఈ దుర్మార్గపు వ్యవస్థ కొనసాగింపుకు బాధ్యులైనవారిపై కఠినచర్యలు తీసుకోవడం సాధ్యంకాదా ?

వృద్ధులకు, అశక్తులకు, అనాధలకు ఆశ్రమాలు ఏర్పాటుచేసి ఒక్కో ఆశ్రమంలో 75 మందికి అవకాశం కల్పించారు. నామమాత్రంగా పెట్టిన యీ సదనాలు ఎన్నివేల మందిని సంరక్షిస్తున్నాయి ?

విద్యాభివృద్ధికి, ఆరోగ్యాభివృద్ధికి తిండి, బట్ట, ఇళ్ళు తదితర కనీసావసరాలకు నోచని కుటుంబాలు ఎన్ని వున్నాయి? వారికి కేటాయించిన ప్రభుత్వ పథకాలు ఎంత మందిని దారిద్ర్య రేఖ నుండి ఎగువకు తెచ్చాయి ? బడ్జెట్‌లో కేటాయింపులు చేసినా విడుదల చేయకుండా ఎక్కడవేసిన గొంగళి అక్కడేలా యీ వర్గాలను కొనసాగిస్తున్నారు. అనేక షెడ్యూల్డు కులాల ఆర్థిక సహాయ సంస్థలను, గిరిజన కులాల ఆర్థిక సంస్థలను ఏర్పాటుచేసినా యింతవరకు 10శాతం కుటుంబాలను కూడా అభివృద్ధిలోకి తేలేకపోయాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ శాఖలకు నిర్ణయించిన రాష్ట్ర, కేంద్ర మంత్రులు కూడా తమ బాధ్యతను అమలుచేయడానికి వెనుకాడుతున్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే వారు తమ పథకాలను అమలుజరుపుతున్నారు. రాష్ట్ర, కేంద్ర కేబినెట్ సమావేశాల్లో కూడా వీరి సమస్యలు చర్చకు రావు.

స్థానిక సంస్థలకు, శాసనసభలకు, పార్లమెంట్‌కు ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే యీ వర్గాలు గుర్తుకువస్తాయి. ఈ వర్గాల ఓట్లను సంపాదించడానికి సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. వీరికి రిజర్వ్‌చేసిన నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను నిర్ణయించే బాధ్యతను అగ్రకులాలే తీసుకుంటున్నాయి. వారే పెట్టుబడులు పెట్టి, గెలిపించుకొని తమ విధానాలను అంగీకరించేవారిగా తయారుచేస్తున్నారు. ఎక్కడైనా, ఎవరైనా వాస్తవాలు చర్చిస్తే అతనిని పార్టీనుండి తొలగించడం లేదా ప్రజాప్రతినిధిగా ఎన్నికకాకుండా చూడటం పరిపాటిగా జరుగుతున్నది. కనీస చట్టాలను అమలుచేసినా యీపాటికి (ఆరు దశాబ్దాలకాలం) దళితులు, గిరిజనులు కొంతమేరకు అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగి సమాజంలో ఒకరుగా వుండడానికి అవకాశం వుంది. ఆ వైపు చర్యలు తీసుకోవడంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల బాధ్యత కీలకంగా వుంది. ఎన్నికల ప్రణాళికలలో వివిధ రాజకీయపార్టీలు ప్రకటించిన దళిత, గిరిజన సంక్షేమ చర్యలను అమలుజరిపే విధంగా ఎన్నికల అనంతరం పాలకులు కృషి చేయాలి. ఆ వైపుగా ప్రయత్నం ప్రారంభించినప్పుడు ఎన్నికల్లో చేసిన వాగ్దానాలకు విలువవుంటుంది. వీరూ సమాజంలో ఒక భాగమేనన్న సామాజిక స్పృహ వుండాలి. ముఖ్యంగా రిజర్వేషన్ స్థానాల్లో ఎన్నికైనవారు రాజ్యాంగపరంగా తమకు కల్పించిన హక్కులను సాధించుకోవడానికి చట్టసభలను సాధనంగా ఉపయోగించుకోవాలి. చట్ట సభల ద్వారా సమస్యలను మొత్తం ప్రజానీకం దృష్టికి తేవడానికిగల అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఎప్పటికప్పుడు అభివృద్ధిజరిగే తక్షణ సహాయ పథకాలకన్నా, దీర్ఘకాలికంగా, శాశ్వితంగా అభివృద్ధి కొనసాగే చర్యలపై దృష్టిని పెట్టాలి. ఆర్థికాభివృద్ధి మాత్రమేగాక సాంఘిక సమానత్వం కూడా కొనసాగే సమాజ స్థాపనకు కృషి చేయాలి.

( ☛5వ పేజీ తరువాయి భాగం...)

బడ్జెట్‌లో దళితుల భాగస్వామ్యం సంఖ్యాపరంగా గణనీయంగా ఉన్నప్పటికీ, దానిని ఖర్చుపెట్టడంలో మళ్ళింపులు జరుగు తున్నాయి. స్పెషల్ కంపోనెంట్ ప్లాన్‌లో ఉన్న బడ్జెట్‌ను ప్రాజెక్టులకు, ఇతర కార్యక్రమాలకు ఖర్చుపెట్టడం విచారకరమైన అంశం. ఒకవైపు అత్యాచారాల నిరోధానికి, అత్యాచారాల నిరోధక చట్టం అమలుకు కేంద్ర ప్రభుత్వ 200 కోట్ల బడ్జెట్ చూపుతున్నప్పటికీ, అత్యాచాలను నిరోధించడంలోనూ, బాధితులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించడంలోనూ, ఏళ్ళతరబడి నిందితులను అరెస్టు చేయకుండా, బాదితులకు న్యాయం చేయకుండా కేసులను పెండింగ్ పెడుతూ చట్టాన్ని సరైన విధంగా అమలు చేయడంలో  అధికారులూ, ప్రభుత్వం విఫలమవుతూనే ఉన్నాయి.

దళితులు ఒక సామాజిక వర్గం. తమకంటూ ఏ విధమైనటువంటి వనరులు (భూమి, ఇల్లు, వ్యవసాయం, వ్యాపారం, ఉద్యోగాలు లాంటివి) లేని వర్గం. ఈ వర్గం అత్యధికంగా ప్రభుత్వ పథకాలపైనే ఆధారపడుతుంది. ఆ ప్రభుత్వ పథకాలు కొన్ని చేరకపోతే, వీరి బ్రతుకుల్లో మిగిలేది ఆకలి చావులు, దారిద్ర్యం, అవిద్య,  వలసలు మరియు అనారోగ్యం మొదలైనవి. అందువలన దళితుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టేటువంటి పథకాలు కేవలం ఎలక్షన్ల వాగ్దానాలుగా కాకుండా దళిత బ్రతుకుల మార్పుకోసం ఏర్పడినటువంటి వనరులుగా స్వీకరించి, వాటిని అన్ని వేళలా పకడ్బందీగా అమలు పరచవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులను మనం గమనించినట్లయితే

**ఉచిత విద్యలో**

- ✤ పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడం.
- ✤ సరిపడినంత సంఖ్యలో ఉపాధ్యాయులు లేకపోవడం.
- ✤ పాఠ్యపుస్తకాలు సమయానికి అందించకపోవడం.
- ✤ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడం.
- ✤ మధ్యాహ్నభోజన పథకాన్ని సరిగా అమలు చేయకపోవడం.
- ✤ పౌష్టికాహార లోపం.
- ✤ వైద్యసేవలు లేకపోవడం.
- ✤ సాంకేతిక విద్యలు అందించడంలో విఫలం.
- ✤ అద్దెభవనాలలో హాస్టళ్ళు నిర్వహించడం.
- ✤ విద్యారినీ. విద్యార్థులకు సరైన రక్షణ కొరవడడం మొదలైనవి.

**అభివృద్ధిలో**

- ✤ దళితులకు సరైన పౌష్టికాహారం లేనందుకు వారు అనారోగ్యం పాలవడం.
- ✤ సరైన వేతనాలు లేకపోవడం.
- ✤ పేదరికం, దారిద్ర్యం.
- ✤ వలస జీవితాలు, నిరుద్యోగం.
- ✤ దళితులపై జరిగే అత్యాచారాలు.
- ✤ ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని అమలు చేయకపోవడం.
- ✤ భూమి లేకపోవడం

మొదలైనవన్నీ కూడా దళితుల అభివృద్ధికి ఆటం కాలుగా ఉన్నాయి. మరి ప్రభుత్వ మ్యానిఫెస్టోలోని అభివృద్ధి ఎవరికి అందుతుందో ఆలోచించవలసిన అంశం. అభివృద్ధి నిరోధకాలైన సాంఘిక దురాచారాలు, అంటరానితనం, కుల, వర్గ, లింగ, మత వివక్షతలను, కులాధిపత్యాన్ని, మతాధిపత్యాన్ని రూపుమాపడంలో ప్రభుత్వం ఎంతవరకు సఫలమైంది ? రాబోవు ఏడేళ్ళలో వీటిని రూపుమాపడానికి ఎలాంటి చర్యలు తీసుకోబోతుంది ? అనేవి మనముందున్న ప్రశ్నలు.

ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలవలన పరి పాలింపబడేదే ప్రజాస్వామ్యం. అయితే,  ప్రజలే పాలకులని చెప్పే ఈ గణతంత్ర రాజకీయ పాలనలో ప్రజల భాగస్వామ్యం ఎంత? ఎలక్షన్‌లో ఎన్నికైన దళిత రాజకీయ అభ్యర్థులను నామమాత్రంగా పదవిలో ఉంచి, ఆ పదవి ద్వారా వచ్చే అధికారాలు, ఫండ్స్‌ను అనుభవిస్తున్న అగ్రవర్ణాల నాయకులను చూస్తే, డా॥ బి. ఆర్. అంబేద్కర్ చెప్పిన " నా దృష్టిలో భారతదేశానికి స్వాతంత్ర్యం అంటే పాలనాధికారం బ్రిటిష్ వారి చేతుల్లోంచి అన్ని విధాలా అగ్రవర్ణాల హస్తగతం కావడమే" అనే మాటలు అక్షరాల సత్యమని ఋజువవుతుంది. ఇలాంటి నాయకులు ఉన్నంతకాలం దళితుల రాజకీయాధికారం ఎండమావిగానే ఉంటుంది. దళిత రాజకీయ నాయకులు తమ హక్కులు, అధికారాలు బాధ్యతలను తెలుసుకొని, వాటిని స్వయంగా నిర్వర్తించినప్పుడే దళితుల రాజ్యాధికారం సాహకారమవుతుంది.

అయితే, రాజ్యాధికారం సాధించడంలో దళితుల పాత్ర ఏమిటి? తమ హక్కుల సాధికారతలో భాగంగా పరిపాలనా యంత్రాంగంపై వత్తిడి తీసుకురావాలి. తమకున్న అధికారాలను ఉపయోగించు కోవడానికి ప్రయత్నించాలి. తమ అధికారాలను వినియోగించుకునే సమయంలో వ్యతిరేకత ఎదురైన యెడల వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలి. దళితులకు పైన తెలిపిన వాటిపై చైతన్యం కలిగించాలి. అంతేకాకుండా, ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను, పథకాలను అమలుపరచే విధంగా వత్తిడి తీసుకు రావలసిన బాధ్యత దళితులపైనే ఉంది. దానినే డా॥ బి.ఆర్. అంబేద్కర్ ఈ విధంగా చెప్పారు.

"సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యానికి మనుగడ లేదు. రాజకీయాధికార సాధనపైనే దళితుల విముక్తి ఆధారపడి ఉంది".

# దళితులపై సామూహిక దాడి

...✍ - సాక్షి

**బాధితుల వివరాలు :**

1. కత్తి పెదపెంచలయ్య (40) S/o చంటియ్య, యస్సీ (మాదిగ), కూలీ వృత్తి, తిక్కవరం గ్రామం, పల్లవోలు పంచాయితీ, మర్రిపాడు మండలం, నెల్లూరు జిల్లా.

FIR నంబర్లు : 56/09, సంఘటన జరిగినతేది : 10/05/2009. సెక్షన్లు : 323 R/w 34 IPC, 3 (I) (X) యస్సీ, యస్టీ అత్యాచారాల నిరోధక చట్టం.

2. కొప్పాల వెంకట నర్సయ్య (32) S/o వెంకటేష్, యస్సీ (మాదిగ), కూలీ వృత్తి, తిక్కవరం గ్రామం, పల్లవోలు పంచాయితీ, మర్రిపాడు మండలం, నెల్లూరు జిల్లా.

FIR నంబర్లు : 57/09, సంఘటన జరిగినతేది : 10/05/2009. సెక్షన్లు : 506, 323 R/w 34 IPC, 3 (I) (X) SC/ST Act.

**నిందితుల వివరాలు :**

1. మాదుపూరి వెంకటేశ్వర్లు S/o అచ్చయ్య
2. రాయళ్ళ రాజబాబు S/o ముసలయ్య
3. మాదుపూరి సుధాకర్ S/o చిన్నబ్బాయి
4. ముప్పళ్ళ తిరుపతి S/o వెంకటస్వామి
5. కట్టకింద సుబ్బారావు S/o శ్రీనివాసులు
6. వెంకటస్వామి
7. బోయపాటి సతీష్ S/o రమణయ్య
8. గంగవరపు హర్ష S/o వెంకటేశ్వర్లు
9. శాఖమూరి మస్తాన్ S/o ముసలయ్య
10. ముప్పాళ్ళ శ్రీను S/o రామయ్య
11. శ్రీను S/o బలరామయ్య

నిందితులందరూ తిక్కవరం గ్రామము, పల్లవోలు పంచాయితీ, మర్రిపాడు మండలం, నెల్లూరు జిల్లా కమ్మకులానికి చెందిన వారు

**సంఘటన వివరాలు :**

ఎలక్షన్ ముందు నామినేషన్ల సమయంలో తెలుగుదేశం పార్టీ నాయకులైన తిక్కవరం గ్రామ మాజీ VRO నర్సపునాయుడు, రత్నం, వెంకటేశ్వర్లు, వెంకట సుబ్బానాయుడు, సుబ్బారాయుడు (టీచర్) తిరుపతి (టీచర్) చంద్రయ్య మరియు మాజీ సర్పంచ్ తిరుపతి మొదలైన వారు దళిత మాదిగవాడకు వెళ్ళి, నామినేషన్ వేయడానికి తమ ట్రాక్టర్‌లో రావసిందిగా కోరారు. అయితే, దళితులు దానికి అంగీకరించక అప్పటి గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకుడైన నాగేశ్వరరావు ట్రాకర్టర్‌లో వెళ్తాము అని సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన అగ్రవర్ణాలు వారిని తమ పొలాల్లోకి రావద్దని అన్నారు. తరువాత ఎలక్షన్ రోజు పెదపెంచలయ్య (మొదటి బాధితుడు) పోలింగ్ బూత్‌లో కాంగ్రెస్ ఏజెంట్‌గా ఉన్నాడు. ఆ సందర్భంలో పైన తెలిపిన వ్యక్తులు కులంపేరుతో దూషిస్తూ, వీడు పోలింగ్ ఏజెంట్‌గా ఉండడం ఏంటి ? అని అన్నారు. తరువాత మే నెల 8 నుండి 10 తేదీవరకు గ్రామంలో రాములవారి తిరునాళ్ళ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ తిరునాళ్ళలో మాదిగలు వంతుల ప్రకారం తడికలు అల్లడం, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయడం, డప్పులు కొట్టడం మొదలైనవి చేసేవారు. అయితే, పైన తెలిపిన సంఘటన మరియు "మిమ్మల్నికొడతారు" అని తరచూ బెదిరిస్తున్న ముప్పళ్ళ, తిరుపతి మాటలకు భయపడి తిరునాళ్ళ కార్యక్రమంలో పాల్గొనకూడదని దళితులు నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న అగ్రవర్ణాలు, తిరునాళ్ళలో పాల్గొనవలసిందిగా దళితులను కోరారు. అయితే, ఈ సారి పెదపెంచలయ్య వంతు రావటంతో, తడికలు అల్లి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశాడు. మూడు రోజులలో రెండు రోజులు డప్పులు కొట్టారు. మూడవ రోజు పాటలకచేరి ఏర్పాటు చేయడం వలన దళితులంతా (స్త్రీలు, పురుషులు, పిల్లలు) ఒకవైపు నిలబడి కార్యక్రమాన్ని చూస్తుండగా, ముప్పళ్ళ తిరుపతి వచ్చి, పెద పెంచలయ్యను నెట్టి కొడుతూ, ఇదేమైన ఎలక్షన్ అనుకుంటున్నార్రా మీ ఇష్టం వచ్చిన వాళ్ళకు ఓట్లేయడానికి అని కులం పేరుతో దూషించి, దుర్భాషలాడారు. అదే సందర్భంలో మరోవైపు కొప్పాల వెంకటనర్సయ్యను మరికొంత మంది తరుముతూ కొట్టారు. ఈ విధంగా అగ్రవర్ణాల వారు అందరూ కలిసి దళితులైన వారందరినీ తరిమి కొట్టడం "కారంచేడులో కొట్టినట్లు మరలా కొట్టండి ఈ మాదిగ నాకొడుకులను" అనడం స్థానిక పోలీసుల సమక్షంలోనే జరిగింది. తరువాత ఫిర్యాదు చేయడానికి వెళ్ళిన బాధితులతో ఈ రోజు మిమ్మల్ని కొడతారని మాకు ముందే తెలుసు అని కానిస్టేబుల్ చెప్పడం గమనార్హం. రక్తపు గాయాలైన బాధితులు ఫిర్యాదుచేసిన తరువాత ఆసుపత్రికి వెళ్ళివైద్యం చేయించుకున్నారు.

**దళితుల ప్రస్తుత పరిస్థితి :**

గ్రామంలో దళితులను బహిరంగ ప్రదేశాలలోనికి అనుమతించడం లేదు. కిరాణాషాపుల్లోని వస్తువుల క్రయవిక్రయాలు చేయనివ్వడం లేదు. బయటకు వచ్చిన దళితులను బెదిరించడం, దాడులు చేయడం జరుగుతుంది. ది. 02/06/05న దళిత మాదిగ యమ్. వెంకటయ్య (50) S/o నాగయ్య జ్వరంతో బాధపడు తుండడంతో రాత్రి 8 గం॥లకు అతని మనువడు శ్రీను (16) (ఇంటర్ రెండవ సంవత్సరం) మందులు తీసుకురావడానికి అంగడికి వెళితే, అతనిని పిలిచి కులంపేరుతో దుర్భాషలాడి ఈ సమయంలో ఎందుకొచ్చావురా అని శాఖమూరి, వెంకటరత్నం, మారుపూడి రామానాయుడు అనే వారు ప్రశ్నించారు. అందుకు సమాధానంగా మాతాతకు మందులు కొనడానికి వచ్చాను జేజి అని చెప్పిన యువకుని కులంపేరుతో దుర్భాషలాడి, నన్ను జేజి పిలవడానికి నీవెవడవురా అని ధౌర్జన్యం చేయబోగా వేరే గ్రామానికి చెందిన వ్యక్తి సర్దిచెప్పి ఆ యువకుని ఇంటికి పంపించారు. ఈ విధంగా ఆ గ్రామంలో దళితులు అనుక్షణం రక్షణ లేకుండా భయం గుప్పెట్లో కాలం వెళ్ళదీస్తున్నారు.

*(☛ తరువాయి 10వ పేజిలో....)*

# ఆలంపూర్ నియోజక వర్గం ఎస్సీ రిజర్వు అయినందున ఎన్నికలు బహిష్కరించిన అగ్రవర్ణాలు

...✍ - జి. తిరుమలయ్య సాక్షి, డిహెచ్ఆర్డి మహబూబ్‌నగర్ జిల్లా

**ప్రాంతం :** తెలంగాణా, **జిల్లా :** మహబూబ్‌నగర్, **మండలం మరియు గ్రామము :** అయిజ, **సంఘటన తేది :** 16/04/2009, **FIR నంబర్లు :** 50,51,52,53/09

**సంఘటన వివరాలు :** అయిజ గ్రామము మహబూబ్‌నగర్ జిల్లాలో కలదు. డిలిమిటేషన్ కారణంగా అయిజ మండలము ఆలంపూర్ మరియు నాగరకర్నూల్ నియోజక వర్గములో విలీనమయినది. అంతేకాకుండా ఆలంపూర్ నియోజక వర్గం ఎస్సీ అభ్యర్ధికి రిజర్వ్ అయినది. దళితులను రాజకీయ నాయకులుగా, MLA, MPలుగా అంగీకరించలేని అగ్రవర్ణాలు దీనిని జీర్ణించుకోలేక పోయారు. ముఖ్యంగా వీరయ్య గుప్త R/o తూముకుంట మరియు అతని అనుచరులు "మాల, మాదిగలకు మనం ఓట్లు వేసి MLAలుగా, MPలుగా చేయకూడదు" అని పాంప్లెట్లు ముద్రించి పంచినారు. ఆవిధంగా చేసినందుకు గాను, పోలీసులు వీరయ్య గుప్తపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినారు. వీరయ్య గుప్తను పోలీసులు అరెస్ట్ చేశారని తెలుసుకున్న అతని అనుచరులు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి పోలీసులపై దాడిచేసి, కంప్యూటర్లను పగులగొట్టినారు మరియు ఆఫీసులో గల ఫర్నిచర్‌ను, వాహనాలను ధ్వంసం చేసి, పోలీసు స్టేషన్‌పై రాళ్ళు విసిరి, పోలీసు డౌన్ డౌన్ అని నినాదాలు చేసి, లాకప్‌లో వీరయ్య గుప్తను బలవంతంగా గుంజుకొని పోయినారు. తరువాత వీరయ్య గుప్తను అరెస్ట్ చేయడానికి తూముకుంట MPP ప్రకాశ్‌గౌడ్ కారణమనే అనుమానంతో అతని ఇంటిపై దాడిచేసి, ఇంటిలో ఉన్న సామాన్లు ధ్వంసం చేసి, బెడ్‌రూమ్‌లో ఉన్న లాకర్‌ను పగులగొట్టి రూ॥ 2,45,000/- నగదును తీసుకునివెళ్ళారు.

అక్కడితో ఆగకుండా వీరయ్య గుప్తమరియు అతని అనుచరులైన 1000 మందిపైగా అగ్రకులస్తులు కలిసి నినాదాలు చేస్తూ, ఎన్నికల సామాగ్రిని ధ్వంసం చేసి, సిబ్బంది తక్షణమే వెళ్ళిపోవాలని బెదిరించారు. కుర్చీలు, బెంచీలు విరగ్గొటి, ఓటర్లను రానీయకుండా అడ్డగించి, ఎన్నికల సిబ్బంది వద్ద ఉన్న సామాన్లను తగులబెట్టారు. అంతేకాకుండా, సిబ్బంది అక్కడ నుండి వెళ్ళకపోతే వారిని కూడా తగులపెడతామని బెదిరించి, పోలింగ్ ఆపడం జరిగింది.

ది.18-04-2009న రీపోలింగ్ కూడా పోలీస్ బందో బస్తుతో, యస్‌పి, కలెక్టర్, ఆర్‌డిఓ మరియు డియస్‌పి వీరందరి నిఘా ఆధ్వర్యంలో జరిగింది. అయితే దళితులు మాత్రమే తమ ఓటును వినియోగించుకుని అగ్రవర్ణాలు పోలింగ్‌ను బహిష్కరించడం ఆశ్చర్యకరమైన అంశం. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా యంత్రాంగం, ప్రభుత్వాలు, ముఖ్యంగా ఎలక్షన్ కమీషన్ ఎన్నికలను విజయవంతంగా, హింసారహితంగా నిర్వహించామని చెప్పుకోవడం దురదృష్టకరం. ఇక ముందైనా ఇటువంటి సంఘటనలు జరుగకుండా చూడవలసినటువంటి ఆవశ్యకత, బాధ్యత వారిపై ఎంతైనా ఉంది.

దళితులు కూడా తమ హక్కులు సాధించుకోవడానికి పోరాడడమే కాదు, న్యాయపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవలసి నటువంటి అవసరం ఉంది. అంతేకాకుండా అగ్రవర్ణాల అభివృద్ధి నిరోధక చర్యలను అంతే స్థాయిలో తిప్పికొట్టి అగ్రవర్ణాల అహం కారాన్ని అణచివేయడానికి నడుంబిగించాలి.

---

*( ☛9వ పేజి తరువాయి భాగం...)*

**కనుగొన్న అంశాలు :**

1. ఇద్దరు బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు రెండు FIR లు నమోదు చేశారు.
2. FIR No : 56/09లో సెక్షన్లు 323 R/w 34 IPC, 3(I)(X) SC/ST Act,
   FIR No : 57/09లో సెక్షన్లు 323 R/w 34 IPC, 3(I) (X) SC/ST Act పెట్టడం జరిగింది.
3. అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించకుండా బాధితులను పిలిచి విచారించారు కానీ, ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
4. నిందితులను అరెస్ట్ చేయలేదు.
5. బాధితులకు తక్షణ సహాయం కూడా అందించలేదు.
6. గ్రామంలో దళితులకు రక్షణ లేదు. వారు భయభ్రాంతులతో జీవిస్తున్నారు.

**సిఫారసులు :**

1. గ్రామంలో శాంతి, భద్రతలు నెలకొల్పి, దళితులకు రక్షణ కల్పించాలి.
2. నిందితులను అరెస్ట్ చేయాలి.
3. ఈ కేసులలో చాలా తక్కువ శిక్షలుపడే నేరాలు పెట్టడం జరిగింది. అయితే ఈ కేసులలో 324, 307 IPC, 3(2)(V) SC/ST చట్టం ప్రకారం సెక్షన్లు మార్చి, నిందితులను కఠినంగా శిక్షించాలి.
4. అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి, నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు తక్షణ సహాయం, నష్టపరిహారం మరియు పునరావాసం కల్పించాలి.

# ఇరుక్కున్న యువత

...✍ - వార్త పేపర్ సౌజన్యంతో

ఎన్నికల కేసుల్లో పట్టుబడిన వారిలో ఎక్కువ మంది యువకులే ఉన్నట్లు అధికారిక సమాచారం. ఈ కేసులు నమోదైన యువకులను అవి జీవితాంతం వెంటాడే పరిస్థితి నెలకొంది. కేసుల్లో ఉన్న వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత లేకపోవడంతో రాజకీయ నాయకుల స్వార్ధప్రయోజనాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. ఈ విధంగా రాజకీయ పడగ నీడలో యువత కొట్టుమిట్టాడుతోంది. పలువురు నిరుద్యోగులు ఉపాధికోసం రాజకీయాలను ఆశ్రయించడంతో ఎన్నికల్లో పోటీకిదిగిన పలువురు నాయకులు వారిని తమ స్వార్ధానికి సమిధలుగా మారుస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటినుండి వివిధ పనుల్లో వినియోగించుకునేందకు రాజకీయనాయకులు యువతకే ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఎన్నికల ప్రచారం నుండి మద్యం, డబ్బు తదితర వాటిని గల్లీ నాయకులకు చేరవేయడం కొరకు వీరికి రకరకాల పనులను అప్పగిస్తున్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల రూపకల్పన, వాటి ప్రచారబాధ్యతలను సైతం వీరే చూసుకోవలసి ఉంది. ఇందుకు టీఫిన్, చాయ్, భోజనం పెట్టడంతోపాటు నెలకు రూ॥ 6 నుండి 9 వేల వరకు వేతనంగా ఇస్తున్నారు. దీనితో రాజకీయ నాయకుల వద్ద పనిచేసేందుకు ఎక్కువ నిరుద్యోగ యువత ఆకర్షితులౌతున్నారు. దీనికితోడు ఎన్నికల్లో తమ నాయకులు గెలుపుసాధిస్తే మంచిస్థితికి వెళ్ళవచ్చనే ఆలోచనలతో ఊహల లోకంలో విహరించడం గమనార్హం. పార్టీ అధికారంలోకివస్తే తమ నాయకునికి మంత్రిపదవి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదని అదే ఇస్తే తమపని రొట్టె విరిగి నేతిలో పడినట్లేనని ఆశలతో పలువురు ఉన్నారు. దీనితో నాయకుడు ఏం చెప్పినా దానిని చిటికెలో పూర్తిచేసి వారి దృష్టిలో పడేందుకు ఎక్కువగా ఆశక్తి చూపుతున్నారు.

కొందరు రాజకీయ నాయకులు ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఈ యువతనే వినియోగిస్తున్నారు. చివరకు మద్యం చేరవేసేందుకు అక్రమ, చట్టవ్యతిరేక చర్యలకు వీరినే ఉపయోగిస్తున్నారు. ఎన్నికల నియమనిబంధనలను కఠినంగా అమలు చేస్తున్న ఎన్నికల కమీషన్ వైఖరితో దాదాపు అన్నీపార్టీలకు ఈ ఎన్నికలు విషమ పరీక్షగా మారాయి. గత అనుభావాల దృష్ట్యా ఎన్నికల్లో బ్యానర్లు, జెండాల పంపిణీ, మద్యం, నోట్లతో ఓట్లను కొనుగోలుచేయడం, చీరల తదితర పంపిణి చేసి ఓటర్లను ప్రలోభపెట్టడం బారీస్థాయిలో జరిగాయి. ప్రత్యర్ధి అభ్యర్ధులకు సంబంధించి దాడులుచేయడం వాటిని కూడా రాజకీయనాయకులు ఎక్కువగా యువకులకే అప్పగిస్తున్నారు. రాత్రి పగలు అనేభేదం లేకుండా ఈ చట్టవ్యతిరేక కార్యక్రమాలన్ని యాధేచ్ఛగా బహిరంగంగా నిర్వహించడం పార్టీల అభ్యర్ధులకు సర్వ సాధారణమైనది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఇటువంటి చట్టవ్యతిరేక చర్యలను అడ్డుకునేందుకు ఎన్నికల కమీషన్ పటిష్టమైన చర్యలను తీసుకుంది. గట్టినిఘా ఏర్పాటుచేయడంతో పాటు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడంతో ఇటువంటివాటిని నిర్వహించడం రాజకీయపార్టీల అభ్యర్ధులకు తలకుమించిన పనిఅవుతుంది. మరోవైపు వీటి బాధ్యత బుజాన వేసుకున్న యువత ఈ తనిఖీల్లో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడడంతో చివరకు వీరి భవిష్యత్తు అంధకారంగా తయారయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే ఈ పనులు అప్పగించి తెరవెనుక వున్న నాయకులు మాత్రం బయటపడకుండా తప్పించుకోవడం విశేషం.

ఈకేసులకు సంబంధించి పట్టుబడినవారిలో 75% మంది యువకులే అని నాయకులగురించి తమ భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని ఎన్నికల అధికారి ఒకరు ప్రస్తవించారు. ఏళ్ళతరబడి అయినా వీరికి విముక్తికలిగే పరిస్థితిలేదనేది అధికార వర్గాల భావన. ఊహాలోకంలో విహరించే యువత రాజకీయనాయకుల స్వార్ధానికి బలిఅవుతూ తమ జీవితాలను ముళ్ళబాట చేసుకోవడం వెనుక రాజకీయాల పట్ల అవగాహన లేకపోవడం ప్రధానలోపమనే అభిప్రాయం అధికార వర్గాల్లో వ్యక్తమవుతుంది. రాజకీయాలంటే పూల బాటలాగా భావించే యువత స్వార్ధరాజకీయాలకు తమను బలిచేస్తున్నారనే వాస్తవాన్ని గ్రహించకపోవడం శోచనీయం అని పలువురు వాఖ్యానిస్తున్నారు.

# దళితులపై జరిగిన అత్యాచార నేరాలు : ఏప్రిల్ - మే 2009

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేదీ/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 1. | తూర్పుగోదావరి | మైనరు బాలికను మోసం చేసి వివాహం | 12.04.09 కాకినాడ, గాంధీనగర్‌కు చెందిన మైనరుబాలిక పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు బుదంపేటలో ఉన్న పాఠశాలకు వెళ్ళివస్తుండగా అదే ప్రాంతానికి చెందిన ఇళ్ళ రాంబాబు, ఆ బాలికను గుడికి తీసుకెళ్ళి, పెళ్ళి చేసుకున్నాడు. నిందితునికి ఇదివరకే వివాహమై, ఇద్దరు పిల్లలున్నారు. |
| 2. | ఖమ్మం | బాలికపై సామూహిక అత్యాచారం, సెల్‌ఫోన్ లో చిత్రీకరణ | 19.04.09 వెంకటాపురానికి చెందిన బాలికను ఆమెతో పరిచయమున్న ఓ యువకుడు అదే గ్రామ పంచాయితీ కార్యాలయసమీపంలోని ఓగదిలోనికి తీసుకెళ్ళాడు అప్పటికే అక్కడ సిద్దంగా ఉన్న మరికొందరు యువకులు ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆదృశ్యాలను కొందరు తమ వద్ద ఉన్న సెల్‌ఫోనులో చిత్రీకరించారు. |
| 3. | మెదక్ | కులదూషణ, దాడి | 21.04.09 సంగారెడ్డి అర్బన్, జహీరాబాద్ పట్టణంలో, బాగారెడ్డిలో దళితులపై దాడిచేసిన మున్సిపల్ వైస్ ఛైర్మన్ సోరదుడు తన అనుచరులతో కలిసి కత్తులు, కర్రలతో భయానక వాతావరణం సృష్టించి, కులంపేరుతో దూషించి, దాడి చేశారు. |
| 4. | విశాఖపట్నం | గ్రామబహిష్కరణ | 21.04.09 నర్సీపట్నం, విశాఖ ఏజెన్సీలో గిరిజనులు ఓటుహక్కు వినియోగించుకున్నారని వారిని గ్రామం నుండి బహిష్కరించిన మావోలు |
| 5. | హైదరాబాద్ | అబార్షన్ సమయంలో ప్రాణం కోల్పోవడం | 21.04.09 మెహిదీపట్నం, చర్లపల్లి ప్రాంతానికి చెందిన, స్నేహ (20) అల్వాల్ ప్రాంతానికి చెందిన గౌతం (25) లు సోమాజిగూడలోని ఓకాల్ సెంటర్‌లో పనిచేస్తున్నారు. వీరు ప్రేమించుకొని వివాహం చేసుకున్నారు. గర్భవతియైన భార్యకు అబార్షన్ చేయించాలని గాంధీ ఆసుపత్రికి చేర్చగా వైద్యం వికటించి, కోమాలోకి వెళ్ళిన స్నేహ మరణించింది. |
| 6 | ఖమ్మం | ఆదివాసీలపై వేధింపులు | 08.04.09 భద్రాచలం మండలంలోని ఛత్తీస్‌గడ్ సరిహద్దు గ్రామాలలో ఆదివాసులపై పోలీసుల వేధింపులు మరియు బైండోవర్ కేసులు పెడుతున్నారు. |
| 7. | గుంటూరు | మహిళ నిర్భంధం | 14.04.09 గుంటూరు, నగరంపాలంకు చెందిన దళిత మహిళ ఆమె భర్త వర్ధన్ ఒక రాజకీయ పార్టీలో ప్రచారం చేస్తుండగా, వారి ఇంటికి వెళ్ళి ఆ మహిళను బయటకు రానివ్వకుండా నిర్బంధించి, మా వార్డులో నీవు వేరే పార్టీకి ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనవలసి వస్తుందని బెదిరించిన కాంగ్రెస్ నాయకులు గంటాపెద్దబ్బాయి, పరమేశ్వరరావు. |
| 8. | రంగారెడ్డి | మైనరు బాలికను ప్రేమపేరుతో వంచనా | 22.04.09 మెదక్ జిల్లాకు చెందిన మహేష్ గౌడ్ నల్గొండ జిల్లాకు చెందిన మైనర్ బాలిక (17) శామీర్‌పేట్, అలియాబాద్ చౌరస్తావద్ద గల సూర్యవంశీమిల్‌లో పనిచేసేవారు. ప్రేమ వివాహం చేసుకుంటానని నమ్మబలికి, కలిసి జీవించి తప్పించుకున్నాడు. |
| 9. | కర్నూల్ | కులదూషణ, బెదిరింపు | 23.04.09 మద్రిగూడు మండలాధ్యక్షుడు పెనగలూరు. వెంకటేష్ తన స్వగ్రామమైన బ్రాహ్మణపల్లి నుండి ఏజెంట్ ఫారాలు తీసుకుని మద్రిపాడుకు వస్తుండగా, ఆత్మకూరు ఎమ్మెల్యేకొమ్మి లక్ష్మయ్య నాయుడు అడ్డగించి, కులంపేరుతో దూషించి బెదిరించాడు. |
| 10. | ఖమ్మం | మైనరుబాలికపై అత్యాచారం | 07.04.09 పాల్వంచ, ఇందిరాకాలనీకి చెందిన 8వ తరగతి చదువుతున్న ఒక బాలికను అదే కాలనీలో నివాసముంటున్న రుక్కాల ప్రభాకర్ (22) పాఠశాలకు వెళ్తున్న బాలికను సైకిల్‌పై వెంబడించి, దగ్గరలోని క్రీడామైదానంలోకి తీసుకెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. |
| 11. | వరంగల్ | మైనర్‌బాలికపై | 19.04.09 మహబూబాబాద్, (మరిపెడ) శనిగపురం గ్రామానికి చెందిన మైనర్‌బాలిక |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| | | యాసిడ్‌పోస్తానని బెదిరింపు | తనను ప్రేమించాలని, లేదంటే ఆమెపై యాసిడ్ పోస్తానని బెదిరించిన వివాహితుడు బోడ రాములు. |
| 11. | మెదక్ | కూలదూషణ, దాడి | 20.04.09 బాగారెడ్డి పల్లెకు చెందిన కిషోర్, సురేష్ (హోంగార్డు)లను వైస్ చైర్మన్ సోదరుడు అతని అనుచరులు దళితులను కులంపేరుతో దూషించి, చితకబాదారు. |
| 12. | ఖమ్మం | మైనర్‌బాలికపై యాసిడ్ దాడి | 20.04.09 భద్రాచాలం పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ కాలనీలో పదవతరగతి చదువుతున్న విద్యార్థినిపై బండిరాంప్రసాద్ పొంచి ఉండి, ఆమెపై యాసిడ్‌దాడిచేశాడు. తృటిలో ఆమె ప్రమాదం నుండి బయటపడింది. గతంలో కూడా బాలికను చంపుతానని బెదిరించి, కులంపేరుతో దూషించాడు. |
| 13. | హైదరాబాద్ | దళిత ఉద్యోగులపై వివక్ష | 21.04.09 కాచిగూడ, ఎపి ట్రాన్స్‌కోలో దళిత ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండా వివక్ష చూపుతూ అన్యాయంచేస్తున్న యజమాన్యం. |
| 14. | అనంతపురం | దళిత అభ్యర్థులను గ్రామప్రవేశ నిరోధం | 21.04.09 మడకశిర నియోజకవర్గం ఇప్పటివరకూ జనరల్ స్థానంగా ఉంది. పునర్విభజన తరువాత ఎస్సీలకు రిజర్వ్ అయిన్పటికీ, ఆ నియోజికవర్గంలోని దాదాపు 108 గ్రామాల్లో దళితులకు ప్రవేశం లేదు. ప్రస్తుతం కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం, బిజెపి, బియస్పీ పార్టీల నుండి పోటీ చేసి ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఎన్నికైన దళితులు ఆయా గ్రామాల్లోకి వెళ్ళేందుకు అనుమతి ఉండదు. |
| 15. | అనంతరపురం | దాడి, గ్రామ బహిష్కరణ | 25.04.09 విడపనకల్ (మం) ఉండబండ గ్రామంలో ఆటో టికెట్ చిల్లర విషయంలో దళితునితో ఆటో యజమాని దేవేంద్రప్ప తగవులాటకు దిగాడు. అనంతరం దాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం రాత్రి ఆర్టీడీ స్కూల్లో నిద్రపోతున్న నాగరాజు, యల్లప్ప, లక్ష్మన్న చంద్రశేఖర్ అనే దళితయువకులపై లింగప్ప , దేవేంద్రలతో పాటు మరో ఎనిమిది మంది కలసి కులంపేరుతో దూషించి, వారిపై దాడిచేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసినందుకు ఆగ్రహించిన అగ్రవర్ణాలవారు దళితులకు గ్రామంలో నీళ్ళు కూడా ఇవ్వరాదనీ, కనీసం మౌలికసదుపాయాలు కల్పించరాదని హుకుం జారీచేశారు. గ్రామం నుండి దళితులను బహిష్కరించి, కిరణాషాపుల్లో సరుకులు అమ్మకూడదని ఆదేశించారు. |
| 16. | రంగారెడ్డి | మైనర్ బాలికను పెళ్ళిచేసుకుంటా నని చెప్పి, కిడ్నాప్ | 25.04.09 ఎర్రగడ్డ, ప్రేమ్‌నగర్‌కు చెందిన సృజన్‌కుమార్ అదే ప్రాంతానికి చెందిన మైనర్ బాలిక (16)ను 2004 నవంబర్ 9న పెళ్ళి చేసుకుంటానని చెప్పి, కిడ్నాప్‌చేసి వరంగల్‌కు తీసుకెళ్ళాడు బాలిక తల్లి, దండ్రుల ఫిర్యాదుమేరకు నిందితుడిని అరెస్టుచేసి, పోలీసులు కోర్టులో హాజరుపరచగా అతనికి శిక్ష మరియు జరిమానా విధించిన కోర్టు. |
| 17. | గుంటూరు | మైనర్‌బాలికపై అత్యాచారం | 23.04.09 పెదకాకాని, సుందరయ్య కాలనీలోని 11 సం॥ మైనర్ బాలికపై అదే కాలనీకి చెందిన తాపీమేస్త్రీ వేగళ్ళా వెంకటరమణ అత్యాచారం చేశాడు. |
| 18. | గుంటూరు | మహిళలపై దాడి | 23.04.09 ఆటోనగర్, ప్రజారాజ్యం మహిళా కార్యకర్త ఓట్లు కొనుగోలుకు డబ్బులు పంచుకున్నట్లు భావించి, కాంగ్రెస్ అనుచరులుగా చెప్పుకుంటున్న కొందరు నగరంపాలెంలోని ఒక గృహంపై సోదాకు వెళ్ళి మహిళలను నానావిధాలుగా దర్భాషలాడి వారిపై దాడి చేశారు. |
| 19. | కృష్ణా | మైనర్‌బాలికను నమ్మించి మోసం | 14.04.09 మచిలీపట్నం, పెడన, 15వ వార్డుపెడన గ్రామానికి చెందిన 13 సం॥ల మైనర్ బాలికను పెళ్ళి చేసుకుంటానని నమ్మించి, 6నెలలపాటు ఆమెను శారీరకంగా అనుభవించిన నిందితుడు లంకె సుబ్రహ్మణ్యంకు 20 సం॥లు జైలుశిక్ష మరియు జరిమానా విధించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జీ. |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 20. | కరీంనగర్ | దాడి, గాయపరచడం | 19.04.09 ఎల్లారెడ్డిపేట (మం) వీర్నపల్లి గ్రామ బాబాయి చెరువు తండాకు చెందిన ఉపాధిహామీ కూలీలైన బానోతు ధూళి, ముడావత్, గోరిలపై ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మీర, రాజు, భూక్య, భరత్‌లు తాము చెప్పిన గుర్తుకు ఓటువేయలేదనే కారణములతో దాడి చేసి, తలపగులగొట్టారు. |
| 21. | కరీంనగర్ | కులదూషణ | 26.04.09 ఓదెల మండలం, శానగొండ గ్రామంలో పెద్దపల్లి అసెంబ్లీ డిడిపి అభ్యర్థి సిహెచ్ విజయరమణారావు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేం సాగర్‌రెడ్డిపై అదే పార్టీకి చెందిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నారాయణ డిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఈద శంకర్‌రెడ్డిపై ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌రాజులు కులంపేరుతో దూషించినట్లు ఫిర్యాదు చేశారు. |
| 22. | ప్రకాశం | కులదూషణ | 24.04.09 ఇంకొల్లు (మం) భీమవరం గ్రామసర్పంచ్ నాయుడు హనుమంతరావు, చెలిశం, రామక్రిష్ట, భీమవరపు శ్రీధర్, చెలిశం, శేషయ్య తనను కులంపేరుతో దూషించారని ఇస్త్రల్, కృపారావు ఫిర్యాదు చేశారు. |
| 23. | ప్రకాశం | ఇరువర్గాల మధ్య ఘర్షణ | 24.04.09 త్రిపురాంతకం (మం) కె. అన్నసముద్రం పోలింగ్ కేంద్రంలో ఇరువర్గాల మధ్య ఘర్షణవల్ల దళితులు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారు. |
| 24. | హైదరాబాద్ | కులదూషణ | 26.04.09 నాంపల్లి విద్యుత్ లైన్‌మెన్ ఎల్లయ్య విధినిర్వహణలో ఉండగా అదే గ్రామానికి చెందిన కోటా రఘునందన్ కులంపేరుతో దూషించారని ఫిర్యాదుచేశారు. |
| 25. | నల్గొండ | మైనర్‌బాలికపై అత్యాచారయత్నం | 28.04.09 కొండమల్లేపల్లి బీసి కాలనీకి చెందిన మైనర్ బాలికను తను ఉంటున్న ఇంటి యజమాని గుంటోజు సత్యనారయణ ఇంట్లో టివీ చూసేందుకు వెళ్ళగా ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించాడు. |
| 26. | తూర్పుగోదావరి | కులదూషణ | 25.04.09 కాజులూరు మండల పరిషత్ కార్యాలయ అవసరణలో గురువారం జరిగిన ధౌర్జన్యంలో తిప్పరాజుపాలెం గ్రామానికి చెందిన దళితులు ముడుకు పెదరాజు, ముడుకు గనిరాజులను కులంపేరుతో దూషించిన వంగా శ్రీనివాస్, నామా సత్తయ్య, రాముడు రమేష్, బలిచక్రర్తులు. |
| 27. | నిజామాబాద్ | కులదూషణ | 26.04.09 కేశిపూర్ గ్రామంలో ఎస్సీ, కులానికి చెందిన ఎలక్షన్ ప్రచారంలో ఓడన్న అనే వ్యక్తిని కులంపేరుతో దూషించిన సురేష్, గంగాధర్‌లు. |
| 28. | తూర్పుగోదావరి | దళితులపై దాడి | 25.04.09 దళిత కాంగ్రెస్ అభ్యర్థి జి.వి. హర్షకుమార్‌పై పిఆర్‌పి కార్యకర్తలు దాడిచేశారు. |
| 29. | అనంతపురం | దళితులపై దాడి | 22.04.09 విడపనకల్లు స్టేషన్ పరిధిలోని వేల్పు ముడుగు గ్రామానికి చెందిన రామాంజనేయులు, ఆంజనేయులు సాకే రామాజంనేయులు మరో 13 మంది దళితులపై అదే గ్రామానికి చెందిన రామచంద్ర, శీనా, నరసింహారెడ్డి, బోయ ఓబులేసుతో పాటు మరో 15 మంది ఇళ్ళపై దాడి చేశారు. |
| 30. | విజయనగరం | కులదూషణ | 29.04.09 జామి మండలం, కలగాడ గ్రామంలో ఈ నెల16న పోలింగ్ రోజు జరిగిన గొడవలో కాంగ్రెస్ మరియు డిటిపి పార్టీలకు చెందిన దళిత కార్యకర్తలను కులంపేరుతో దూషించిన అగ్రవర్ణాల వారు. |
| 31. | ఖమ్మం | చేతబడినెపంతో సామూహిక దాడి | 26.04.09 కామేపల్లి (మం) పొన్నెకల్ (మం) బర్లగూడెం గ్రామంలో తేజావత్, బాలు, అచ్చమ్మ, వాలులపై చేతబడి చేస్తున్నారన్న నెపంతో అదేగ్రామానికి చెందిన బానోతు బాలు, వీరన్న, దేవిజి, దూబ్లీ, బుల్లిలు సామూహికంగా దాడిచేసి, గాయపరచారు. |
| 32. | కర్నూల్ | దళిత మహిళపై దాడి | 26.04.09 ఎన్నికల్లో భాగంగా ఆమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో ప్రచారం చేపట్టిన మహిళా కాంగ్రెస్ రాష్ట్రనాయకురాలు అంకం విజయపై దాడి చేసిన లక్ష్మి, ముంతాజ్, షెహనాజ్. |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 33. | చిత్తూరు | దళిత సర్పంచ్‌పై దాడి | 27.04.09 పెనుమూరు (మం) కలవకుంటకు చెందిన చెందిన దళిత సర్పంచ్ శ్రీరాములు టిడిపి వర్గీయులకు మధ్య ఎలక్షన్ సందర్భంగా స్వల్ప వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి 8 గం॥లకు పంచాయితీ కార్యాలయ భవనం వద్ద టిడిపికి చెందిన కార్తీక్, దినేష్, మాసిలా మణి, విశ్వనాథ్ మొదలైనవారు దాడి చేశారు. |
| 34. | రంగారెడ్డి | కులదూషణ | 29.04.09 యాలాల (మం) జుంటుపల్లి అనుబంధ గ్రామమైన రేళ్ళగడ్డ తాండాకు చెందిన నేనావత్, సోనీబాయి, ఇతరులు జాతీయ ఉపాధిహామీ పథకం కింద చెరువు పూడిక తీతపనులకు వెళ్ళారు పనివిషయంలో జుంటుపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు, రాంచంద్రయ్య, బైరని రాములు, పెంటప్ప, సాకలి నర్సింహులు, శంకర్ మొ॥ వారికి సోనీబాయికి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో ఆమెను కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడారు. |
| 35. | రంగారెడ్డి | ఎంపిటిసిపై కుల దూషణ | 29.04.09 కందుకూరు, మీర్‌ఖాన్‌పేట గ్రామమంలో అక్రమంగా మట్టి తవ్వకాలు పేరుతో జరుగుతున్నాయని తెలిసి ప్రభుత్వాధికారులతో కలిసి విచారణకు వెళ్ళిన ఎంపిటిసి డి. రామచందర్‌తో సత్తయ్య అనే వ్యక్తి గొడవపడి, కులంపేరుతో దూషించాడు. |
| 36. | నల్గొండ | మంత్రాల నెపంతో దాడి | 01.05.09 ఫైలాన్‌కాలనీ, జమ్మనకోట తండాలో జరావత్ కుమార్ కుటుంబంపై మంత్రాలు చేస్తున్నారనే నెపంతో 8 మంది వ్యక్తులు దాడిసి గాయపర్చారు. |
| 37. | తూర్పుగోదావరి | దాడి, ఇంటి ధ్వంసం | 01.05.09 వేమగరి (కడియం) ఈ నెల 24న వేమగిరిలో ప్రజారాజ్యం పార్టీ కార్యకర్తలకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య దళిత వాడలో ఎన్నికలను పురస్కరించుకుని ఏర్పడిన వివాదంలో ఇద్దరు వ్యక్తులను గాయపరచి, ఇంటిని ద్వంసం చేశారు. |
| 38. | చిత్తూరు | మైనర్‌బాలిక అత్యాచారం, హత్య | 02.05.09 మదనపల్లి, చౌడేపల్లి (మం) దిగువపల్లె గ్రామం మోట్ల పల్లెకు చెందిన వెంకట రమణ కుమార్తై సార్తిక (5)ను, పాతకక్షను దృష్టిలో పెట్టుకుని అత్యాచారం, హత్య చేసిన అప్పయ్యకు మరణశిక్ష యావజ్జీవ కారాగార శిక్ష మరియు జరిమానా విధించిన మదనపల్లి ఎడిజె. |
| 39. | నెల్లూరు | కులదూషణ | 03.05.09 జలదండి (మం) చోడవరం రామప్పాడు చోడవరం మధ్యన ఇటీవల అధికారులు రోడ్డును ధ్వంసంచేస్తే, దళితులను కులంపేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడుతున్న అగ్రవర్ణాలవారు. |
| 40. | కర్నూల్ | కులదూషణ | 04.05.09 సుల్తానాబాద్, బొంతకుంటపల్లి గ్రామం తమపొలంలో హార్వెస్టర్‌తో పనులు చేయించుకుంటున్న లింగంపల్లి మైసమ్మను అకారణంగా మీకు హార్వెస్టర్‌లు ఎందుకని కులంపేరుతో దూషించిన బాపురావు. |
| 41. | తూర్పుగోదావరి | ఓటువారు చెప్పిన అభ్యర్థికి వేయలేదని కులదూషణ | 26.04.09 కాకినాడ, కాజులూరు గ్రామంలోగల ఎస్సీ కాలనీ నుండి సమారు పది మంది దళిత మహిళలు ప్రజారాజ్యం పార్టీతరపున రోజువారి కూలీలుగా ప్రచారం చేశారు. తరువాత పోలింగ్ రోజు దగ్గర ఉన్నవాటిని కాంగ్రెస్‌కే ఓటేయ్యాలని తాగిన మత్తులో వారిని బంధించారు. ఈసారికి మేము ప్రజారాజ్యకే వేస్తాము అని చెప్పినందుకు ఎంపిపి తమ్మారావు కులంపేరుతో దూషించడమే కాకుండా వారిపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. |
| 42. | వరంగల్ | మంత్రాలనెపంతో దళితుల హింస గ్రామబహిష్కరణ | 28.04.09 మరిపెడ మండలంలో గిరిజనులు, దళితులపైన నిత్యం మంత్రాల నెపంతో దాడులు చేయడం, వారిపై అంటరానితనం పాటించడం వారి కుటుంబాలను గ్రామం నుండి బహిష్కరించడం మొ॥ నేరాలు చేస్తున్న అగ్రవర్ణాలు |

| వ. నెం. | స్థలము | అత్యాచార స్వభావం | తేది/సంఘటన వివరాలు |
|---|---|---|---|
| 43. | మహబూబ్‌నగర్ | దళిత ఉపసర్పంచి హత్య | 04.05.09 కొయిల్‌కొండ (మం) బూర్లపల్లి గ్రామంలో దళిత ఉపసర్పంచి హనుమంతుకు అగ్రవర్ణాలకు చెందిన మహిళ వాలంటీర్‌కు అక్రమసంబంధం ఉండడంతో అతనిని హత్యచేసి, విద్యుత్ షాక్‌తో మృతిచెందినట్లు చిత్రీకరించారు. |
| 44. | మెదక్ | కులదూషణ | 08.05.09 మనూర్ (మం) తుమ్నూర్ గ్రామానికి చెందిన మాదిగ రాములు అనే దళిత వ్యక్తి పెళ్ళి కార్యక్రమంలో నృత్యాలు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన శేరిమలరెడ్డితో పాటు మరో ఇద్దరు కులంపేరుతో దూషించారు. |
| 45. | కడప | కులదూషణ | 05.05.09 రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో కాపురం ఉంటున్న సి. మహదేవను కులంపేరుతో దూషించిన ఉపాధ్యాయుడు శ్రీరాములు. |
| 46. | గుంటూరు | సామూహిక అత్యాచారం | 07.05.09 వెల్దుర్తి మండలం మండారితో ప్రార్ధనా కూటముల్లో పాల్గొనేందుకు ప్రకాశం జిల్లా యర్రగొండపాలేనికి చెందిన ఓ మహిళ అదే గ్రామానికి చెందిన జీవన్‌బాబుతో బయలుదేరింది. రిక్షా పుల్లర్ ఇమ్మానియేల్, దావీదు, బుజ్జి మొదలైన వారు వారిని బెదిరించి, యూరియా గోడౌన్ ప్రాంతంలో ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. |
| 47. | నిజామాబాద్ | కులదూషణ | 06.05.09 సిరికొండ మండలంలోని చిన్న వాలోట్ గ్రామంలో బి.సి. గంగాధర్‌ను కులం పేరుతో దూషించిన శ్యాంరెడ్డి గంగాధర్‌రెడ్డి |
| 48. | విజయనగరం | కులదూషణ | 02.05.09 సాలూరు రూరల్ మాజీ ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యురాలు ప్రస్తుతం తెలుగుదేశం ఎమ్మెల్యే అభ్యర్ధి గుమ్మడి సంధ్యారాణిని కులంపేరుతో దూషించిన సత్తిబాబు, సూర్యప్రకాష్, వేణు, సత్యనారయణ మొదలైనవారు ఈ కేసుపై బహిరంగ విచారణ చేపట్టిన డిఎస్పీ. |
| 49. | వరంగల్ | మైనర్‌బాలికపై అత్యాచారయత్నం | 05.05.09 ఉంగుటూరు, కైకరం గ్రామంలో ఈ నెల 11వ తేదీన పాలకొల్లు దుర్గారావు (32) అదే గ్రామానికి చెందిన ఏడేళ్ళ మైనర్‌బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. |

**To** **Book-Post** **Printed Matter**


**మీ అభిప్రాయాలను ఈ క్రింది చిరునామాకు పంపండి.**

**సాక్షి హ్యూమన్ రైట్స్ వాచ్, ఎ.పి.**

**ఇం.నెం. 10-3-129, 2వ అంతస్తు, టీచర్స్ కాలనీ, ఈస్ట్‌మారేడుపల్లి, సికింద్రాబాద్ - 500 026.**

**ఫోన్ : 040- 65440969, ఫ్యాక్స్ : 040- 27737086** ఇ-మెయిల్ sakshi_ap@satyam.net.in

వెబ్‌సైట్ : www.sakshiap.org **Toll Free Dalit Call No - 18004255535, 27737093**



Published by **V. Nanda Gopal,** Director, Sakshi Human Rights Watch, A.P. Secunderabad - 500 026.